# కులవృత్తులకు జీవం..



### సీఎం కేసీఆర్ మేలు మరువలేనిది



సాంకేతిక అభివృద్ధితో కటింగ్ షాపుల్లో పలు రకాల యంత్రాలను వాడుతున్నాం. దీంతో అధికంగా వచ్చే విద్యుత్తు బిల్లును చెల్లించలేని స్థితిలో ఉన్న మా కులవృత్తుల వారికి రాష్ట్ర ప్రభుత్వం ఉచిత విద్యుత్తును అందించడం అదృష్టంగా భావిస్తున్నా. పేదల బాధలు తెలుసుకొని ఎప్పటి సమస్యలను పరిష్కస్తున్నా సీఎం కేసీఆర్ నిజమైన దేవుడు. వారు చేస్తున్న మేలు ఈ జన్మలో మరవలేనిది. అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసి అన్ని వర్గాల ప్రజలను ఆదుకుంటున్నారు. మా జీవితాల్లో వెలుగులు నింపుతున్న సీఎం కేసీఆర్ సారుకే నా మద్దతు.

**-రఘు, తాండూరు**



### ఆర్థికంగా ఎదుగుతున్నాం..

సీఎం కేసీఆర్ ప్రభుత్వం కులవృత్తులకు పూర్వ వైభవం తీసుకొచ్చింది. వృత్తిని నమ్ముకుని జీవిస్తున్నా నాయీబ్రాహ్మణులకు 250 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్తును అందిస్తూ వారు ఆర్థికంగా ఎదిగేలా చర్యలు తీసుకుంటున్నది. పెరిగిన అద్దెలు, కరెంట్ బిల్లులతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యాం. గతంలో కరెంట్ బిల్లులు చూస్తేనే భయపడాల్సి వచ్చేది. 250 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్తును అందిస్తుండటంతో సంతోషంగా కులవృత్తిని కొనసాగిస్తున్నాం. అన్ని వర్గాల ప్రజలకు అండ గా ఉంటున్న సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు. **-రమేశ్, నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు, వికారాబాద్**

### ఎంతో మేలు జరుగుతున్నది

లాండ్రీలు, దోభీఘాట్లకు ఉచితంగా విద్యుత్తును సరఫరా చేస్తుండటంతో ఎంతో మేలు జరుగుతున్నది.



విద్యుత్తు బిల్లులు కట్టుకోలేని పరిస్థితుల్లో ఉన్న మాకు నెలకు 250 యూనిట్ల వరకు విద్యుత్తును ఉచితంగా సరఫరా చేయడం సంతోషం. సీఎం కేసీఆర్ కులవృత్తుల అభ్యున్నతికి కృషి చేస్తున్నందుకు ప్రత్యేక కృతజ్ఞతలు. **-చాకలి బస్వరాజ్, తాండూరు**

- గొల్ల,కురుమలకు గొర్రెలు, మత్స్యకారులకు చేపపిల్లల పంపిణీ
- రజకులు, నాయీబ్రాహ్మణులకు విద్యుత్తు సబ్సిడీ
- జిల్లాలో 1064 హెయిర్ సెలూన్లు, 1601 లాండ్రీ షాపుదారులకు లబ్ధి
- ఇప్పటివరకు రూ.5 కోట్ల మేర సబ్సిడీని చెల్లించిన రాష్ట్ర ప్రభుత్వం

**బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో కులవృత్తుల వారి జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయి. కుల వృత్తులకు పూర్వవైభవాన్ని తీసుకొచ్చేందుకు సీఎం కేసీఆర్ ప్రభుత్వం** గొల్ల కురుమలకు రాయితీపై గొర్రెల పంపిణీతోపాటు మత్స్యకారులకు వంద శాతం సబ్సిడీతో చేపల పెంపకం కార్యక్రమాన్ని అమలు చేస్తున్నది. కేవలం కులవృత్తుల వారే కాకుండా రాష్ట్రంలో ని అన్ని వర్గాల వారు ఆర్థికంగా పురోగతి సాధించేందుకు ముఖ్యమంత్రి అనేక రకాల సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారు. నాయీబ్రాహ్మణులు, రజకులకు ఉచితంగా ప్రతినెలా 250 యూనిట్ల వరకు విద్యుత్తును సరఫరా చేస్తూ ఆదుకుంటున్నారు. కులవృత్తుల వారికి విద్యుత్తు వినియోగం తప్పనిసరి కావడంతో సంపాదించిన మొత్తం లో చాలావరకు విద్యుత్తు బిల్లులకే చెల్లించాల్సి వచ్చేది. దీం తో వారి ఆర్థికాభివృద్ధి అంతంత మాత్రంగానే ఉండేది. నాయీబ్రాహ్మణులు, రజకుల విజ్ఞప్తులు, ఆర్థిక స్థితిగతులను ప్రభుత్వం దృష్టిలో పెట్టుకొని గత మూడేండ్ల నుంచి ప్రతినెలా 250 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్తును సరఫరా చేస్తున్నది. కాగా జిల్లాలో ఇప్పటివరకు 1,064 హెయిర్ సెలూన్లకు రూ.2 కోట్లు, 1,601 లాండ్రీ షాపులకు రూ. 3 కోట్ల మేర సబ్సిడీని ప్రభుత్వం అందించింది. ప్రతినెలా విద్యు త్తు బిల్లులు చెల్లించాల్సిన బాధ తప్పడంతో తాము ఆర్థికంగా ఎదుగుతున్నామని.. తమ అభ్యున్నతికి కృషి చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికే మద్దతు అంటూ నాయీబ్రాహ్మణులు, రజకులు స్పష్టం చేస్తున్నారు.

-వికారాబాద్, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ)



### సగర్వంగా బతుకుతున్నాం..

కులవృత్తిని నమ్ముకుని దుస్తులను ఐరన్ చేసే మాకు కొన్ని సందర్భాల్లో బొగ్గులు కూడా లభించకపోవడంతో వృత్తిని మానేయాల్సి వచ్చింది. ప్రస్తుత రోజుల్లో ప్రతి ఒక్కరూ గ్యాస్ సిలిండర్‌ను వినియోగిస్తుండటంతో బొగ్గులు దొరకడంలేదు. అయితే మా బాధలను గుర్తించిన సీఎం కేసీఆర్ లాండ్రీ, దోభీఘాట్లకు ప్రతినెలా 250 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తును సరఫరా చేస్తుండటంతో కుల వృత్తిని చేసుకుంటూ సగర్వంగా బతుకుతున్నాం. **-లక్ష్మణ్, గరీబ్‌నగర్, వికారాబాద్**

# ముదిరాజ్‌ల సంక్షేమానికి పెద్దపీట

- బీసీల అభివృద్ధికి బీఆర్ఎస్ చేయూత
- మరోసారి గెలిపించండి.. మరింత అభివృద్ధి చేస్తా
- ముదిరాజ్‌ల ఆత్మీయ సమ్మేళనంలో అభ్యర్థి రోహిత్‌రెడ్డి
- బీఆర్ఎస్‌కు ముదిరాజ్ కులస్తుల సంపూర్ణ మద్దతు

తాండూరు, నవంబర్ 19 : ముదిరాజ్‌ల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని బీఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. ఆదివారం తాండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ముదిరాజ్‌ల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. దీనికి నియోజకవర్గంలోని వేలాది మంది ముదిరాజ్ కులస్తులు తరలివచ్చారు. తాండూరులో ముందెన్నడు లేని విధంగా అభివృద్ధి చేసిన రోహిత్‌రెడ్డి మళ్లీ గెలవాలని ఆశీర్వదిస్తూ గజమాలతో ఘనంగా సన్మానించారు. తాండూరు నియోజకవర్గ ముదిరాజ్ యూత్ ప్రెసిడెంట్ రవి ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అధిష్ఠానం బీసీలకు అన్యాయం చేసిందన్నారు. రేవంత్‌రెడ్డి టికెట్లను అమ్ముకోవడంతో వెనుకబడిన కులాల వారికి మోసం జరిగిందని..అందుకే రేటెంతరెడ్డికి ఈ ఎన్నికల్లో సరైన గుణపాఠం చెప్పాలన్నారు. 70 ఏండ్లుగా ఏమీ చేయని కాంగ్రెస్, బీజేపీలు ఇప్పుడు బీసీలకు మేలు చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వంలోనే అన్ని వర్గాల వారికి మేలు జరుగుతుందన్నారు. ఇంటింటికీ సంక్షేమ పథకాలను అందించి ఆదుకుంటున్నారన్నారు. తాండూరులో రెండు ఎకరాల్లో రూ.2 కోట్లతో బీసీ సమీకృత భవన నిర్మాణం జరుగుతుందని..త్వరలోనే ముదిరాజ్ కులస్తుల కోసం ముదిరాజ్ ఆత్మగౌరవ భవన నిర్మాణానికి కృషి చేస్తానని ప్రకటించారు. గడిచిన తొమ్మిదిన్నరేండ్లలో నియోజకవర్గంలో రూ.1672.49 కోట్ల అభివృద్ధి పనులతోపాటు రూ.1648.12 కోట్ల సంక్షేమ పథకాలను ప్రజలకు అందించినట్లు తెలిపారు. తాండూరు పట్టణంలో అభివృద్ధి పనులకు రూ.1191.86 కోట్లు, తాండూరు మండలంలో రూ.236.14 కోట్లు, యాలాల మండలంలో 97.77 కోట్లు, బషీరాబాద్ మండలంలో 68.18 కోట్లు, పెద్దేముల్ మండలంలో అభివృద్ధి పనులకు రూ.78.54 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. అనంతరం బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య కుమారుడు డాక్టర్ అరుణ్‌కుమార్, బీసీ సంఘం నాయకులు లల్లూయాదవ్, రాజ్‌కుమార్ మాట్లాడుతూ బీసీల అభ్యున్నతికి బీఆర్ఎస్ సర్కార్ చేయూతనిస్తుందన్నారు. కాంగ్రెస్, బీజేపీలతో బీసీలకు ఒరిగేందేమీ లేదన్నారు. తాండూరులో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి బీసీల డిమాండ్లను గుర్తించి సేవలు చేయడం అభినందనీయమన్నారు. బీసీల సంక్షేమానికి కృషి చేస్తున్న రోహిత్‌రెడ్డికి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామన్నారు.

అత్యధిక మెజార్టీతో రోహిత్‌రెడ్డిని గెలిపించి ముదిరాజ్, బీసీల సత్తా చాటుతామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఉమాశంకర్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు అనురాధ, పరిమళ, బీసీ, ముదిరాజ్ సంఘాల ప్రతినిధులు, ముదిరాజ్ ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.




ముదిరాజ్ కులస్తుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

సమ్మేళనానికి అత్యధిక సంఖ్యలో తరలివచ్చిన మహిళలు

